నవతరం నలభీములు

- ఎఫ్‌సీఐలో పలు ఫుడ్‌కోర్సుల్లో శిక్షణ
- ఇప్పటికే పాక శాస్త్రంలో రాణిస్తున్న పూర్వ విద్యార్థులు
- ప్రపంచ ఉపాధ్యాయ దినోత్సవం సందర్భంగా నేడు వంటల పోటీలు



కూర వండుటంలో విద్యార్థికి శిక్షణ ఇస్తున్న అధ్యాపకురాలు కముధిని



స్పాంజ్ కేకులు తయారు చేస్తున్న విద్యార్థులు



తయారు చేసిన గోబీ, చికెన్ కర్రీలతో విద్యార్థి ఉమరిల్ల



తయారు చేసిన నూడుల్స్‌తో ఇన్‌స్ట్రక్టర్ రాజేంద్రకుమార్



ఫుడ్‌క్రాఫ్ట్ ఇన్‌స్టిట్యూట్‌లో వంటశాల

ఆరిలోవ: ఆతిథ్య రంగం విస్తరిస్తున్న నేపథ్యంలో నవతరం నలభీములను తయారు చేస్తోంది విశాఖలోని ప్రభుత్వ ఫుడ్‌క్రాఫ్ట్ ఇన్‌స్టిట్యూట్. యువతకు వంటల్లో శిక్షణ అందిస్తూ ఆరితేరిన చెఫ్‌లుగా తీర్చిదిద్దుతోంది. ఇక్కడ పాకశాస్త్రంలో ప్రావీణ్యం పొందిన ఎంతో మంది ప్రస్తుతం దేశ, విదేశాల్లో మాస్టర్ చెఫ్‌లుగా రాణిస్తున్నారు. ఈ ఇన్‌స్టిట్యూట్‌లో ప్రస్తుతం 90 మందికి పైగా విద్యార్థులు వివిధ ఫుడ్ కోర్సుల్లో శిక్షణ పొందుతున్నారు. ప్రపంచ ఉపాధ్యాయ దినోత్సవాన్ని పురస్కరించుకుని గురువారం ఇక్కడ విద్యార్థులకు ఇన్‌స్టిట్యూట్ అధ్యాపకులు వంటల్లో పోటీల నిర్వహణకు ఏర్పాట్లు పూర్తి చేశారు.

1986లో శ్రీకారం..

విశాఖపట్నంలో ఫుడ్‌క్రాఫ్ట్ ఇన్‌స్టిట్యూట్‌కు 1986లో శ్రీకారం చుట్టారు. జాతీయ రహదారిని ఆనుకుని విశాఖ వేలీ స్కూల్ పక్కన ఈ ఇన్‌స్టిట్యూట్‌ను ఏర్పాటు చేశారు. ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ సాంకేతిక విద్యాశాఖ నిర్వహిస్తున్న ఈ సంస్థలో ప్రస్తుతం మూడు కోర్సుల్లో ఏడాదిన్నర, ఆరు నెలల కాల వ్యవధుల్లో శిక్షణ ఇస్తున్నారు. ప్రాంతీయ, దేశీయ, విదేశీ వంటకాల తయారీలో ఇక్కడ ఇన్‌స్ట్రక్టర్లు, అధ్యాపకులు తర్ఫీదునిస్తున్నారు. వెజ్, నాన్‌వెజ్ వంటకాలతో పాటు కేక్‌లు, బన్‌లు, బిస్కెట్లు, జామ్‌లను తయారీ చేయడంలో విద్యార్థులకు మంచి సామర్థ్యం కలిగిస్తారు. ఇన్‌స్టిట్యూట్ ప్రారంభం నుంచి ఇప్పటి వరకు సుమారు 3,800 మందికి పైగా విద్యార్థులు ఇక్కడ శిక్షణ పొందారు. వారిలో 85 శాతానికి పైగా ఇదే రంగంలో ఉపాధి పొందుతున్నారు. సుమారు 350కు పైగా మహిళలు ఈ సంస్థలో శిక్షణ పొందడం విశేషం. విద్యార్థులకు ఉత్తీర్ణత, ఉత్తీర్ణత కాకపోవడం వంటి వాటితో సంబంధం ఉండదు. వారి నైపుణ్యం(స్కిల్)పైనే ఆధారపడి ఉంటుంది.

ప్రస్తుతం 90 మంది విద్యార్థులు

ప్రస్తుతం ఆరు నెలలు, ఒకటన్నర సంవత్సరాల కోర్సులు నిర్వహిస్తున్నారు. ఫుడ్ ప్రొడక్షన్ అండ్ పెటిసరీ, బేకరీ అండ్ కన్ఫెక్షనరీ కోర్సులు ఒకటన్నర సంవత్సరాల కాల వ్యవధితో అందుబాటులో ఉన్నాయి. దీనిలో ఒక సంవత్సరం చదువుతో పాటు ఆరు నెలల పాటు ఇండస్ట్రియల్ ట్రైనింగ్‌లో భాగంగా ప్రాక్టికల్స్ ఉంటాయి. ఈ ఏడాది నుంచి ఆరు నెలల ఫుడ్ అండ్ బేవరేజ్ సర్వీస్ కోర్సు నిర్వహిస్తున్నారు. ప్రవేశానికి అర్హత పదో తరగతి. అయితే ఇంటర్మీడియట్, డిగ్రీ, పీజీ, బీటెక్ చదువుకున్నవారు సైతం ఇక్కడ శిక్షణ పొందుతుండడం గమనార్హం. ఈ కోర్సుల్లో ప్రస్తుతం 90 మందికి పైగా విద్యార్థులు శిక్షణ పొందుతున్నారు. వీరిలో 14 మంది బాలికలున్నారు. ప్రపంచ ఉపాధ్యాయ దినోత్సవాన్ని పురస్కరించుకుని గురువారం జరిగే పోటీలకు వీరంతా సన్నద్ధమవుతున్నారు. పాక శాస్త్రంలో తమ ప్రావీణ్యాన్ని పరీక్షించుకోనున్నారు.

అధికారిక లోగో ఆవిష్కరిస్తాం..

ఇప్పటి వరకు ఫుడ్‌క్రాఫ్ట్‌కు లోగో లేదు. ప్రపంచ ఉపాధ్యాయ దినోత్సవం సందర్భంగా అధికారికంగా లోగో ఆవిష్కరిస్తాం. విద్యార్థులకు పోటీలు నిర్వహించి అధ్యాపకులను సత్కరిస్తాం. ఫుడ్ క్రాఫ్ట్‌లో శిక్షణ పొందిన విద్యార్థులకు ప్రస్తుతం మంచి భవిష్యత్ ఉంది.

– కె.వి రమణ, ప్రిన్సిపాల్, ఎఫ్‌సీఐ

ఇంజినీరింగ్ కళాశాలలో కొత్త మెస్ ప్రారంభం



మెస్‌ని ప్రారంభిస్తున్న వీసీ ప్రసాదరెడ్డి, నారాయణరెడ్డి

ఏయూ క్యాంపస్: ఆంధ్ర విశ్వవిద్యాలయం ఇంజినీరింగ్ కళాశాలలో కొత్తగా ఏర్పాటు చేసిన భోజన శాలను వీసీ ఆచార్య పి.వి.జి.డి.ప్రసాదరెడ్డి, ప్రముఖ వ్యాపారవేత్త నారాయణరెడ్డితో కలిసి బుధవారం ప్రారంభించారు. శివాజీపాలెంలో నిర్మించిన ఆరెంజ్ హాస్టల్‌కి అనుసంధానంగా దాదాపు రూ.40 లక్షల వ్యయంతో మెస్‌ను అభివృద్ధి చేశారు. ఒకే పర్యాయం 250 మంది విద్యార్థులు కూర్చుని భోజనం చేసేలా కేవలం 20 రోజుల వ్యవధిలో ఈ మెస్‌ను ఏర్పాటు చేశారు. స్టెయిన్ లెస్ స్టీల్ బెంచీలు ఏర్పాటు చేసి, కిచెన్‌ను నిర్మించారు. ఇంజినీరింగ్ కళాశాల ప్రిన్సిపాల్ ఆచార్య జి.శశిభూషణరావు, పూర్వ రిజిస్ట్రార్ ఆచార్య కృష్ణమోహన్, అధికారులు పాల్గొన్నారు.

నేడు సహస్ర తులసీదళార్చన

డాబాగార్డెన్స్ : కనకమహాలక్ష్మి దేవాలయంలో ప్రతి గురువారం ఉదయం 8 నుంచి 9 గంటల వరకు సహస్ర తులసిపూజ నిర్వహించనున్నారు. పూజలో పాల్గొనదలిచే భక్తులు రూ.1,500 పూజా రుసుం చెల్లించి పాల్గొనవచ్చు. భక్తులు యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా, టౌన్ కొత్తరోడ్డు శాఖ, అకౌంట్ నంబరు 060810011006691, ఐఎఫ్ఎస్‌సీ కోడ్ యూబీఐఎన్ 0806091లో చెల్లించాలి. ఆన్‌లైన్ ద్వారా ట్రాన్స్‌ఫర్ చేసిన భక్తులు ఆ వివరాలు, పూజ జరిపించాల్సిన వారి పేరు, గోత్రనామాలు, పూర్తి చిరునామా, ఫోన్ నంబరును 8985515989 నంబరుకు వాట్సప్ చేయాలి.

క్లుప్తంగా

వైఎస్సార్ బీమా పరిహారం అందజేత



మృతురాలి కుటుంబ సభ్యులకు తక్షణ బీమా సహాయం అందిస్తున్న కార్పొరేటర్ సునీత

ఆరిలోవ: జీవీఎంసీ 13వ వార్డు సచివాలయం –5 పరిధి ఏఎస్ఆర్ నగర్‌లో బ్రెయిన్ స్ట్రోక్‌తో ఈ నెల 2న షబార బాతున్ అనే మహిళ మరణించారు. ఆమెకు వైఎస్సార్ బీమా వర్తించింది. స్థానిక కార్పొరేటర్ కెల్ల సునీత బాధిత కుటుంబ సభ్యులను బుధవారం పరామర్శించారు. అనంతరం సచివాలయం సిబ్బందితో కలసి బీమా తక్షణ సహాయం కింద రూ.10 వేలు నగదు అందజేశారు. మిగతా నగదు కుటుంబ సభ్యుల బ్యాంకు ఖాతాలో జమ చేస్తారని కార్పొరేటర్ తెలిపారు. ఈ కార్యక్రమంలో సచివాలయం వెల్ఫేర్ సెక్రటరీ రాధిక, స్థానిక వైఎస్సార్‌సీపీ నాయకులు కెల్ల సత్యనారాయణ, దుర్గారావు పాల్గొన్నారు.

చలో స్టీల్‌ప్లాంట్‌కు తరలిరండి



మాట్లాడుతున్న సీపీఎం జిల్లా కార్యవర్గ సభ్యుడు ఆర్కేఎస్వీ కుమార్

మద్దిలపాలెం : విశాఖ స్టీల్‌ప్లాంట్ పరిరక్షణకు గురువారం తలపెట్టిన చలో స్టీల్‌ప్లాంట్ కార్యక్రమాన్ని అన్నివర్గాల ప్రజల విజయవంతం చేయాలని సీపీఎం జిల్లా కార్యవర్గ సభ్యుడు ఆర్కేఎస్వీ కుమార్ పిలుపునిచ్చారు. మద్దిలపాలెంలో ముఠా కార్మికులతో బుధవారం జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. కూర్మన్నపాలెం జంక్షన్ వద్ద బహిరంగ సభ జరుగుతుందన్నారు. స్టీల్‌ప్లాంట్‌ను రక్షించుకోవడం మన అందరి బాధ్యతని చెప్పారు. అనంతరం అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పార్టీ నాయకులు కృష్ణారావు, తదితరులు పాల్గొన్నారు.

ధర్మారావు మృతికి సంతాపం

ఎంవీపీ కాలనీ: ఇటీవల రోడ్డు ప్రమాదంలో గాయపడి కేజీహెచ్‌లో చికిత్స పొందుతూ మృతి చెందిన దొలపల్లి ధర్మారావుకు వైఎస్సార్‌సీపీ నాయకులు సంతాపం తెలిపారు. మంగళవారం విశాఖ ఎంపీ ఎంవీవీ సత్యనారాయణతో పాటు పలువురు నాయకులు కేజీహెచ్‌కు వెళ్లి ధర్మారావు కుటుంబ సభ్యులు పరామర్శించిన విషయం తెలిసిందే. అయితే అప్పటికే ఆయన పరిస్థితి విషమంగా ఉండగా.. చికిత్స పొందుతూ మరణించారు. దీంతఁ వైఎస్సార్‌సీపీ నాయకుడు అక్కరమాని వెంకటరావుతో పాటు పలువురు అప్పుఘర్‌లోని ధర్మారావు నివాసానికి వెళ్లి మృతదేహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ప్రభుత్వం తరఫున అండగా ఉంటామని హామీ ఇచ్చారు.

యువకుడిపై హత్యాయత్నం

అల్లిపురం : యువకునిపై హత్యాయత్నానికి పాల్పడిన ఘటన టూటౌన్ పోలీస్‌స్టేషన్ పరిధిలో మంగళవారం రాత్రి చోటు చేసుకుంది. సీఐ బి.తిరుమలరావు తెలిపిన వివరాల ప్రకారం బంగారమ్మమెట్ట ప్రాంతానికి చెందిన పి.బాలభార్గవ స్థానికంగా గల సాయిప్రసన్న మెడికల్ ఏజెన్సీలో డెలివరీ బాయ్‌గా పని చేస్తున్నాడు. ఇతనికి గత ఏడాది కాలంగా పూతి వెంకటరెడ్డి, పూతి గణేష్‌రెడ్డితో స్నేహం కొనసాగుతోంది. అయితే పది రోజుల క్రితం పూతి వెంకటరెడ్డికి, బాలభార్గవ్‌కు గొడవ జరగటంతో వీరిద్దరు మాట్లాడుకోవడం లేదు. ఈ నేపథ్యంలో మంగళవారం రాత్రి ఒంటి గంట సమయంలో పూతి వెంకటరెడ్డి బాలభార్గవకు ఫోన్ చేసి నీలమ్మ వేపచెట్టు దగ్గరకి రమ్మని చెప్పడంతో భార్గవ అక్కడికి వెళ్లాడు. అక్కడ పూతి వెంకటరెడ్డితో పాటు పూతి గణేష్‌రెడ్డి, సబ్బి శ్రీనివాస్ ఉన్నారు. ఆ ముగ్గురిలో ఒకరు భార్గవ పీక పట్టుకుని, వారి వెంట తెచ్చుకున్న కత్తితో భార్గవ ఎడమ చేతి మీద, ఎడమ వైపు కడుపులో పొడవటంతో తీవ్రంగా గాయపడ్డాడు. అక్కడి నుంచి తప్పించుకుని కేజీహెచ్‌కు చేరుకున్న భార్గవ చికిత్స పొందుతున్నాడు. ఈ మేరకు సమాచారం అందుకున్న టూటౌన్ పోలీసులు ఎఫ్ఐఆర్ నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

చురుగ్గా జగనన్న ఆరోగ్య సురక్ష సర్వే



శివాజీపాలెంలో వైద్య పరీక్షలు చేస్తున్న సిబ్బంది

మద్దిలపాలెం : జగనన్న ఆరోగ్య సురక్షలో భాగంగా జీవీఎంసీ 22వ వార్డులోని ఏడు సచివాలయాల పరిధిలో ఇంటింటి సర్వే చురుగ్గా సాగుతోంది. ముందుగా సచివాలయాల పరిధిలోని వార్డు వలంటీర్లు సర్వే చేసి, అర్బన్ ఆరోగ్య కేంద్రం వైద్య అధికారుల దృష్టికి తీసుకువెళ్తున్నారు. అనంతరం యూపీహెచ్‌సీ సూపర్‌వైజర్ నేతృత్వంలో సచివాలయ ఏఎన్ఎం, ఆశా వర్కర్లు, నర్సింగ్ కళాశాల విద్యార్థులు ఇంటింటికీ వెళ్లి ఏడు రకాల వైద్య పరీక్షలు చేస్తున్నారు. శివాజీపాలెంలో బుధవారం ఇంటింటికీ వెళ్లి వైద్య పరీక్షలు చేసి, నమోదు చేశారు.

కళలకు నిరంతర ప్రోత్సాహం తప్పనిసరి



అనగనగా ఒక రాజు నాటికలో ఓ సన్నివేశం



కళాకారులను సత్కరిస్తున్న దాడి వీరభద్రరావు

ఏయూ క్యాంపస్: కళలకు నిరంతరం ప్రోత్సాహం కల్పించడం తప్పనిసరని మాజీ మంత్రి దాడి వీరభద్రరావు అన్నారు. బుధవారం ఏయూ రంగస్థల విభాగం ఆధ్వర్యంలో డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ అసెంబ్లీ మందిరం వేదికగా ఏర్పాటు చేసిన నాటికల ప్రదర్శనను ఆయన ప్రారంభించారు. అనంతరం మాట్లాడుతూ నాలుగు దశాబ్దాల క్రితం తాను రచించిన అనగనగా ఒక రాజు నాటిక నేటి సమాజానికి సైతం దగ్గరగా ఉంటోందన్నారు. ఏయూ ఆర్ట్స్ కళాశాల ప్రిన్సిపాల్ ఆచార్య ఎ.నరసింహారావు మాట్లాడుతూ ఏయూ కళలకు నిలయంగా నిలుస్తోందన్నారు. ఏయూలో నాటక ప్రదర్శనల సంఖ్యను పెంచుతామన్నారు. ఈ కార్యక్రమంలో సీనియర్ పాత్రికేయుడు రమణమూర్తి, డాక్టర్ ఎం.భాస్కరరావు తదితరులు పాల్గొన్నారు. అనంతరం ప్రదర్శించిన అనగనగా ఒక రాజు, సైలెన్స్ ప్లీజ్ నాటికలు ఆకట్టుకున్నాయి. కళాకారులకు జ్ఞాపికలు బహూకరించి, సన్మానం చేశారు.

ఇంటర్ విద్యార్థి ఆత్మహత్య



సాయి మోహన్ మృతదేహం

ఆరిలోవ: స్నేహితులతో తిరుగుతూ చెడు వ్యసనాలకు బానిసైన ఓ విద్యార్థి ఆత్మహహత్య చేసుకున్నాడు. ఆరిలోవ పోలీసులు తెలిపిన వివరాలు ప్రకారం.. జీవీఎంసీ 10వ వార్డు ఆదర్శనగర్ దరి సుందర్‌నగర్‌లో పాలతీర్థపు శ్రీనివాసరావు భార్య, ముగ్గురు పిల్లలతో నివాసముంటున్నాడు. కుమారుడు సాయిమోహన్(17) ఇసుకతోటలోని ఓ కాలేజీలో ఇంటర్మీడియట్ రెండో సంవత్సరం చదువుతున్నాడు. నిత్యం స్నేహితులతో తిరుగుతూ చెడు వ్యసనాలకు బానిసయ్యాడు. ఏం జరిగిందో ఏమో గాని బుధవారం సాయంత్రం ఇంట్లో ఎవరూ లేని సమయంలో ఫ్యాన్‌కు ఉరివేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు. కార్పెంటర్‌గా పనిచేస్తున్న తండ్రి, హోం టేకర్‌గా పని చేస్తున్న తల్లి ఇంటికి వచ్చి చూసేసరికి తలుపుల లోపల గడియ పెట్టి ఉంది. ఎంతకీ తీయకపోవడంతో స్థానికులు సహాయంతో తలుపులు తెరిచి చూసేసరికి సాయిమోహన్ మృతదేహం ఫ్యాన్‌కు వేలాడుతూ కనిపించింది. దీంతో తల్లిదండ్రులు, కుటుంబ సభ్యులు కన్నీరుపర్యంతమయ్యారు. తండ్రి శ్రీనివాసరావు పోలీసులకు ఇచ్చిన సమాచారంతో సీఐ సోమశేఖర్ ఆధ్వర్యంలో సిబ్బంది సంఘటనా స్థలానికి చేరుకుని మృతదేహాన్ని పోస్టుమార్టం కోసం కేజీహెచ్‌కు తరలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ఘనంగా యోగాచార్య శత జయంతి



విజేతలతో శ్రీనివాసానంద సరస్వతి, రిటైర్డ్ వీసీ ముత్యాలనాయుడు

సీతంపేట: శ్రీరామం ఇంటిగ్రల్ యోగా(శ్రీయోగా) ఆధ్వర్యంలో ద్వారకానగర్ బీవీకే కళాశాలలో యోగా గురువు, యోగాచార్య రాపర్తి రామారావు శత జయంతి ఉత్సవాలు బుధవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా రిటైర్డ్ విశ్రాంత వీసీ ఎం.ముత్యాలనాయుడు మాట్లాడుతూ యోగా గురువు రాపర్తి రామారావు ఆశయాల సాధనకు శిష్యులంతా కృషి చేయాలన్నారు. యోగాసనాల పోటీలు నిర్వహించి విజేతలకు బహుమతులు, జ్ఞాపికలు అందజేశారు. ఆనందాశ్రమ పీఠాధిపతి శ్రీనివాసానంద సరస్వతి మాట్లాడుతూ సనాతన ధర్మం అంటే ప్రకృతి సూత్రాలను అనుసరించడం, ఇతర మతాల్లా హిందువులు కూడా వారి సంప్రదాయాలను కొనసాగిస్తూ సమాజ సేవ చేయాలని కోరారు. కార్యక్రమంలో విజయనగరం డిప్యూటీ ఈఈ వై.గోవిందరావు, ఏయూ రిటైర్డ్ ప్రిన్సిపాల్ డి.వెంకటరావు, ఆర్.ఎస్.ఎన్.మూర్తి, అసిస్టెంట్ ప్రొఫెసర్ జి.ఈశ్వరి, కొవ్వాడ శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

రేషన్ షాపుపై 6ఏ కేసు నమోదు



రేషన్ షాపులో తనిఖీలు చేస్తున్న విజిలెన్స్, సివిల్ సప్లై అధికారులు

సీతంపేట: విజిలెన్స్ అడిషనల్ ఎస్పీ స్వరూపరాణి ఆదేశాల మేరకు సీఐ తిరుపతి రావు, ఎస్ఐ రవికుమార్, సిబ్బంది, పౌర సరఫరాల శాఖ అధికారులు కలిసి బుధవారం అక్కయ్యపాలెం శంకువానిపాలెంలోని 0387014 నంబర్ రేషన్ షాపులో తనిఖీలు నిర్వహించారు. రికార్డులు, స్టాకు పరిశీలించగా.. 570 కిలోల పీడీఎస్ బియ్యం అధికంగా ఉన్నట్టు గుర్తించారు. సీ–1955 చట్టం కింద సదరు రేషన్ షాపుపై 6ఏ కేసు నమోదు చేశారు. తనిఖీల్లో ఆర్ఐ మురళీ పాల్గొన్నారు.

వైఎస్సార్‌సీపీ గెలుపునకు సైనికుల్లా పని చేయాలి



సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీ ఎంవీవీ

ఎంవీపీ కాలనీ: గృహసారథులు, సచివాలయాల కన్వీనర్లు వచ్చే సార్వత్రిక ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీ గెలుపు కోసం సైనికుల్లా పనిచేయాలని విశాఖ ఎంపీ, ఆ పార్టీ తూర్పు నియోజకవర్గ సమన్వయకర్త ఎంవీవీ సత్యనారాయణ పిలుపునిచ్చారు. బుధవారం రాత్రి వెంకోజీపాలెంలోని సీఎంఆర్ ఫంక్షన్ హాల్‌లో తూర్పు నియోజకవర్గ 15, 16, 22, 23 వార్డుల సచివాలయ జేసీఎస్ కన్వీనర్లు, గృహసారథుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంవీవీ మాట్లాడుతూ మా నమ్మకం నువ్వే జగన్ కార్యక్రమాన్ని విస్తృతంగా ప్రజల్లోకి తీసుకెళ్లాలన్నారు. ఏపీకి జగన్ ఎందుకు కావాలి అనే అంశంపై విపులంగా ప్రజలకు వివరించాలన్నారు. అధికారంలోకి రావడానికి చంద్రబాబు అండ్ కో ప్రజలను మోసం చేస్తున్న తీరు, అసత్యాలను ప్రచారం చేస్తూ ప్రభుత్వానికి ఇరకాటంలో పెట్టడానికి చేస్తున్న కుట్రలను ప్రజల్లోకి పెద్ద ఎత్తున తీసుకురావాలన్నారు. అనంతరం ఎంపీ ఎంవీవీని తూర్పు నియోజకవర్గ పార్టీ నాయకులు సత్కరించారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్సీ వరుదు కల్యాణి, వైఎస్సార్‌సీపీ నగర అధ్యక్షుడు కోలా గురువు, ఆయా వార్డుల కార్పొరేటర్లు, ముఖ్య నాయకులు పాల్గొన్నారు.

చేనేత వస్త్ర ప్రదర్శన ప్రారంభం



చేనేత వస్త్రాలను తిలకిస్తున్న నటి రేఖ బోజ్

బీచ్ రోడ్డు: భారతీయ సంస్కృతిలో స్కిల్ చేనేత వస్త్ర ఉత్పత్తులకు ఎంతో ప్రత్యేకత ఉందని టాలీవుడ్ నటి రేఖ బోజ్ అన్నారు. బీచ్ రోడ్డులోని హోటల్ గేట్ వేలో బుధవారం ఏర్పాటు చేసిన వీవ్స్ అండ్ క్రాఫ్ట్స్ వస్త్ర ప్రదర్శనను ఆమె ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ చేనేత వస్త్రాలకు నేటికీ ఆదరణ తగ్గలేదన్నారు. డిజైనర్లు సైతం చేనేతకారులు నేస్తున్న ఉత్పత్తులను సృజనాత్మకంగా డిజైన్ చేస్తున్నారన్నారు. నిర్వాహకురాలు శ్రీలత మాట్లాడుతూ ఈ ప్రదర్శన ఈ నెల 9వ తేదీ వరకు ఉదయం 10 నుంచి రాత్రి 8 గంటల వరకు కొనసాగుతుందన్నారు.

కవి సమ సమాజ సభ్యత్వం స్వీకరించాలి

సీతంపేట: కవి సమ సమాజ సభ్యత్వం స్వీకరించాలని సహృదయ సాహితి సంస్థ అధ్యక్షుడు శేఖరమంత్రి ప్రభాకర్ కోరారు. స్థానిక ప్రిజం కళాశాలలో బుధవారం జరిగిన కవి సమ్మేళనంలో ఆయన మాట్లాడుతూ కవి మనిషితనాన్ని నిరూపించాలన్నారు. డాక్టర్ కె.వి.ఎస్.మూర్తి మాట్లాడుతూ సి.నారాయణరెడ్డి కవిత్వం గురించి వివరించారు. డాక్టర్ డి.వి.సూర్యారావు మాట్లాడుతూ కవిత్వం అజరామరంగా భాసిల్లాలంటే కవులు మంచి కవిత్వం రాసే దిశగా కృషి చేయాలని సూచించారు. సంస్థ కార్యదర్శి చిన సూర్యనారాయణ లలిత గీతాల రచనల్లో మెళుకువలను వివరించారు. కవి సమ్మేళనంలో డాక్టర్ మూర్తి, కర్మయోగి, కుప్పిలి భీమేశ్వరరావు, కొత్తూరి రమణ, రామతాత, రాంప్రసాద్, పీవీఆర్‌కే రావు, కె.రాఘవాచార్యులు పాల్గొన్నారు.

మత సామరస్యానికి విశాఖ ప్రతీక

సీతంపేట: మత సామరస్యం ఆవశ్యకతపై అవగాహన కల్పించేందుకు బీవీ ఫౌండేషన్ ఫర్ పీస్ అండ్ హార్మోనీ, రెలిజియస్ ఫ్రీడం సంస్థల ప్రతినిధులు బుధవారం నగరంలో వివిధ మతాలకు చెందిన దేవాలయాలను సందర్శించారు. ఈ కార్యక్రమాన్ని ఆచార్య వి.బాలమోహన్‌దాస్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మత సమైఖ్యతకు విశాఖ ప్రతీకని, నగర ప్రజలు శాంతికాముకులని, ఇతరులకు ఆదర్శప్రాయులని కొనియాడారు. దీనిలో భాగంగా పోర్టు వెంకటేశ్వరస్వామి ఆలయం, అక్కడే ఉన్న చర్చి, దర్గా, గురుద్వారాలను సందర్శించి వారి ఆచారాలు, సంప్రదాయాలను అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో నరవ ప్రకాశరావు, రాజశేఖర్, నరసింహరావు, గౌరీ శంకర్, ప్రజ్ఞాన్‌కుమార్, మహ్మద్ హుస్సేన్, రాజేంద్ర జైన్, బెనర్జీ పాల్గొన్నారు.

బ్యాగు అపహరించిన కేసులో దర్యాప్తు ముమ్మరం

సీతమ్మధార : పట్టపగలే పార్కింగ్ చేసిన కారు అద్దాలు పగులగొట్టి లోపల బంగారం, నగదు ఉన్న బ్యాగును దొంగలించిన కేసులో నాలుగో పట్టణ పోలీసులు దర్యాప్తు ముమ్మరం చేశారు. దీనిపై సెక్యూరిటీ గార్డులను పోలీసులు విచారిస్తున్నట్లు తెలుస్తోంది. విజయవాడకు చెందిన జి.శ్రీని వాసరెడ్డి డైమండ్ పార్క్ వద్ద పార్కింగ్‌లో కారు నిలిపి టిఫిన్ కోసం వెళ్లి తిరిగి వచ్చేసరికి అగంతకులు కారు అద్దాలు పగులగొట్టి లోపల బ్యాగు చోరీ చేసిన విషయం తెలిసిందే. దీనిపై బాధితుడు శ్రీనివాసరెడ్డి ఫిర్యాదు మేరకు నాలుగో పట్టణ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. జన సంచారం అధికంగా ఉండే డైమండ్ పార్కు వద్ద పట్టపగలు ఉదయం 11 గంటల సమయంలో చోరీ చేయడాన్ని పోలీసులు సీరియస్‌గా తీసుకున్నారు. దీనిపై ఇప్పటికే సీసీ కెమెరాలను పరిశీలించారు. అలాగే అక్కడ విధులు నిర్వర్తిస్తున్న ఇద్దరు సెక్యూరిటీ గార్డులను విచారిస్తున్నట్లు సమాచారం.

స్వచ్ఛతపై అవగాహన అవసరం



మాట్లాడుతున్న రోటరీ ఇంటర్నేషనల్ క్లబ్ ప్రతినిధి మధు

మద్దిలపాలెం : స్వచ్ఛతపై అందరికీ అవగాహన అవసరమని రోటరీ ఇంటర్నేషనల్ క్లబ్ ప్రతినిధి మధు అన్నారు. హెచ్‌బీ కాలనీలోని ఓ స్కూల్‌లో బుధవారం విద్యార్థులకు స్వచ్ఛత, పరిశుభ్రతపై అవగాహన కల్పించారు. ప్లాస్టిక్‌ను విడనాడాలని సూచించారు. చెత్తతో సేంద్రియ ఎరువులు తయారు చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో స్కూల్ ఉపాధ్యాయులు పాల్గొన్నారు.